అన్నదాతలకు విశిష్ట సంఖ్య

- రైతుల వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు
- విశిష్ట సంఖ్య ఉంటేనే పథకాలు
- రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియ

నూజివీడు: దేశంలోని పౌరులకు వివిధ సందర్భాల్లో గుర్తింపుగా ఆధార్‌ను వినియోగిస్తున్నట్లుగానే వ్యవసాయ భూములు కలిగిన రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 11 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్యను అందించేందుకు రైతుల వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేస్తున్నారు. రానున్న రోజుల్లో రైతు విశిష్ట సంఖ్య కీలకపాత్ర వహించనుంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రీలో రైతుల వివరాలను నమోదు చేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఈ నమోదును గ్రామ వ్యవసాయ, గ్రామ ఉద్యాన సహాయకులు నిర్వహిస్తున్నారు.



నూజివీడులో ఫార్మర్ రిజిస్ట్రీలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

నమోదు ఇలా...

రైతులు అగ్రిస్టాక్ ఫార్మర్ రిజిస్ట్రీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. అలాగే గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తమ వివరాలను అక్కడ ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులకు గాని, ఉద్యాన సహాయకులకు గాని తెలిపి నమోదు చేసుకోవాలి. తమ వెంట పట్టాదారు పాసుపుస్తకం లేదా 1 బి ఫారం, ఆధార్ జిరాక్సు, ఆధార్ సంఖ్యకు అనుసంధానం చేసిన సెల్‌ఫోన్‌ను తీసుకువెళ్లాలి. నమోదు చేసే సమయంలో వచ్చే ఓటీపీలను చెప్పినట్లయితే నమోదు కార్యక్రమం పూర్తవుతుంది.

విశిష్ట నంబర్‌తో ఎన్నో ఉపయోగాలు

రైతులకు ప్రభుత్వాలు వివిధ సందర్భాల్లో రాయితీలు అందజేయడమే కాకుండా అనేక పథకాలు అమలు చేస్తాయి. ప్రత్యేక గుర్తింపు కార్డు ఉంటే పీఎం కిసాన్ నగదు జమ చేయడంతో పాటు విత్తనాలు, ఎరువులపై రాయితీలు, పంటల బీమాతోపాటు కనీస మద్దతు ధర కల్పించడం, రాయితీపై యంత్రపరికరాలు, ట్రాక్టర్లు, కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు దిగుబడులు కొనుగోలు చేయడంతో పాటు రాయితీపై అందజేసే వ్యవసాయ పరికరాలు అందించడం తదితర అనేక ఉపయోగాలు రైతులకు చేకూరతాయి.

స్లో గా సర్వర్లు

నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమం ప్రారంభించడంతో సర్వర్లు కొన్ని సమయాల్లో నెమ్మదిస్తున్నాయి. దీంతో రైతుల వివరాలను నమోదు చేసేందుకు ఎక్కువ సమయం పడుతోంది. ఒక్కోసారి ఓటీపీ రావడానికి కూడా సమయం తీసుకుంటోందని రైతులు చెబుతున్నారు. రైతులందరూ నమోదు చేసుకునే వరకు సమయం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో నమోదైన రైతుల వివరాలు

మండలం	మొత్తం రైతులు	నమోదైన రైతుల సంఖ్య
నూజివీడు	13,500	8,459
చాట్రాయి	8,725	8,175
ఆగిరిపల్లి	10,630	8,751
ముసునూరు	8,113	4,215
మొత్తం	40,968	29,600

నమోదు ప్రక్రియ కొనసాగుతోంది



ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులకు చెందిన వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. నమోదు చేసుకోవడం ద్వారా ప్రతి రైతుకు విశిష్ట సంఖ్యను ప్రభుత్వం కేటాయిస్తోంది. ఈ సంఖ్య ఆధారంగా రైతులకు ప్రభుత్వ పరంగా అమలు చేసే పథకాలు, రాయితీలు వర్తించే వీలుంది. ఇది ఎంతో ముఖ్యమైంది.

– జి. విద్యాసాగర్, ఏడీఏ, నూజివీడు

పశుగణన పక్కాగా జరగాలి

పశు సంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు



తిరువూరు: పశుగణన చేయడంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ హనుమంతరావు అన్నారు. ఎ.కొండూరులో గురువారం పశుగణన, పశువులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై తిరువూరు డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల మేరకు పశుగణన జరపాలన్నారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి, గొల్ల వ్యాధి, నోటికి వచ్చే వ్యాధులకు ముందస్తుగా వేసే వ్యాక్సినేషన్ నూరుశాతం పూర్తిచేయాలన్నారు. డివిజన్‌లో జరుగుతున్న వ్యాక్సినేషన్, పశుగణనపై మండల పశువైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం గొల్లమందల, కంభంపాడు గ్రామాల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. పశుసంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేష్, తిరువూరు, ఎ.కొండూరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎం. కిషన్ సింగ్, కె. రామారావు, పశువైద్యాధికారులు శ్వేత, స్వప్న, అభిలాష్, సాయికృష్ణ, వీఎల్‌ఓ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పనిభారం తగ్గించాలని వినతి



తిరువూరు: ఆరోగ్య శాఖతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన సర్వేలు, ఇతర పనులు తమకు అప్పగించడంతో పనిభారం పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తిరువూరు పట్టణంలోని ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు అన్నారు. పని భారం తగ్గించాలని కోరుతూ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రేష్మాబేగంకు గురువారం వినతి పత్రం అందజేశారు. నగర పంచాయతీ పరిధిలో పన్నుల వసూలు, సామాజిక సర్వేల కారణంగా విధి నిర్వహణలో సమతుల్యం లోపిస్తున్నందున తమకు ఇతర శాఖల పనులు అప్పగించవద్దని కోరారు.

వైభవంగా విగ్రహాల శోభాయాత్ర



తిరువూరు: తిరువూరులో పునర్నిర్మించిన పాటిమీద దాసాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 9న ప్రతిష్ఠించనున్న విగ్రహాలతో గురువారం పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయం వద్ద విగ్రహాలకు వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు, నిర్మాణ కమిటీ సభ్యులు సంకా రాజారావు, గుడిమెట్ల చిన వెంకటేశ్వరరావు, కొల్లిపర సుబ్బారావు, ఆలయ శిల్పి పుచ్చకాయల వెంటేశ్వరరావు తదితరులు పూజాదికాలు నిర్వహించారు. మహిళల కోలాట నృత్యాలు, మేళతాళాలతో శోభాయాత్ర జరిగింది.

మెడిటేషన్‌పై అవగాహన



జి.కొండూరు: కవులూరు సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో మెడిటేషన్‌పై కవులూరు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మర్షి పితామహ పత్రీజీ మార్గ దర్శకత్వంలో 41 రోజుల మండల ధ్యాన సాధనలో భాగంగా 41వ రోజు ముగింపుగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్పిరిచ్యువల్ టాబ్లెట్స్ అకడమిక్ సీఈఓ శ్రీదేవి (వైజాగ్) రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. శ్రీదేవి మాట్లాడుతూ ధ్యానం, జ్ఞానం ద్వారా ఆలోచనా విధానం మార్చుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఈ విధానంలో ఎటువంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెరుకూరి వెంకటేశ్వరరావు, లక్ష్మీ దంపతులు, చెరుకూరి శ్రీనివాసరావు, రజనీ దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రతి వీధిలోనూ గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒక్క ఆగిరిపల్లిలోనే 200లకు పైగా వీధి కుక్కలు ఉన్నట్లు అంచనా. కుక్కల సంచారంతో పాఠశాలకు విద్యార్థులు ఒంటరిగా వెళ్లేందుకు భయపడుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్లపైకి గుంపులు గుంపులుగా వచ్చి పాదచారులు, వాహన చోదకులపై దాడులు చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంబడిస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. అధికారులు మాత్రం వీధి కుక్కల నియంత్రణ విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ



మైలవరం: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బ్రాంజ్ మెడల్ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల తెలిపారు. కళాశాలలో గురువారం విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నందిగామ కేవీఆర్ కళాశాల ఆధ్వర్యంలో విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 4, 5 తేదీలలో నిర్వహించిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని వివరించారు. విద్యార్థులను కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యానికి పెద్దపీట

డీపీఓ లావణ్యకుమారి

మూలపాడు(ఇబ్రహీంపట్నం): గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి పి.లావణ్యకుమారి అన్నారు. మూలపాడు పంచాయతీలో ఆకస్మికంగా ఆమె పర్యటించారు. గ్రామ పంచాయతీలో రికార్డులు పరిశీలించారు. గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించారు. పారిశుద్ధ్యంలో ఎదురవుతున్న ఇబ్బందులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరణ సమయంలో తడి, పొడి చెత్తను వేరుచేయాలన్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. పిట్‌లలో తయారు చేస్తున్న వర్మి కంపోస్టును పరిశీలించారు. వర్మి కంపోస్ట్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించాలని సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామ కార్యదర్శి పి.అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



తడి పొడి చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీఓ లావణ్య కుమారి

ముమ్మరంగా ఉపాధి పనులు

నూజివీడు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఏపీఓ శ్యాం గురువారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనుల్లో రెండు వేల మంది కూలీలు ప్రతి రోజూ పాల్గొంటున్నారన్నారు. ట్రెంచ్ కటింగ్ పనులు, సప్లయ్ ఛానల్స్, ఫీడర్ ఛానల్స్, పంట కాలువలు తదితర వాటిల్లో పూడిక పనులు, చెరువుల పూడిక పనులు, మామిడి, పామాయిల్ తోటల్లో పాదులు తవ్వే పనులు తదితర వాటిల్లో కూలీలు పాల్గొంటున్నారన్నారు. ఎండల తీవ్రత పెరగడంతో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే పనులు చేస్తున్నారని చెప్పారు. జాబ్ కార్డు ఉన్న వారు ఎంతమంది పని కోసం వచ్చినా వారికి పని కల్పిస్తామన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ విజ్ఞప్తి చేశారు.



పల్లెర్లమూడిలోని ఆయిల్‌పామ్ తోటలో ట్రెంచ్ తవ్వకం పనులు చేస్తున్న కూలీలు

చట్టాలపై విద్యార్థినులకు అవగాహన

జి.కొండూరు: బాలికలు విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్‌లో వచ్చే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు వీలుకలుగుతుందని ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శ్రీశ్రీ పాఠశాల విద్యార్థినులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే అటువంటి వారిపై ధైర్యంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇటువంటి ఘటనలలో బాలికలు, మహిళల వివరాలు గోప్యంగా ఉంచి రహస్య విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చేస్తామని చెప్పారు. బాలికల హక్కులు, చట్టాలను వివరించారు. అనంతరం స్టేషన్‌లో ఉన్న కమ్యునికేషన్ వ్యవస్థ, లాకప్‌లను విద్యార్థినులకు దగ్గరుండి చూపించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాఘవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సతీష్‌కుమార్

మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించాలి

ఐసీడీఎస్ నూజివీడు సీడీపీఓ ధనలక్ష్మి

నూజివీడు: మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించాలని ఐసీడీఎస్ నూజివీడు సీడీపీఓ ధనలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలో ర్యాలీ, మహిళలకు అవగాహన కార్యక్రమం, ఆటల పోటీలు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, దేశం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మహిళలు, పురుషులు సమానమనే భావన ప్రతి ఒక్కరిలో రావాలని చెప్పారు. నేడు మహిళలకు అవకాశం కల్పిస్తే పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను తప్పనిసరిగా చదివించాలన్నారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మేటాస్ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శుభప్రియ, హెచ్‌వీ కుమారి, అంగన్‌వాడీ వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ముష్టికుంట్ల(తిరువూరురూరల్): స్వయం సహాయక సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకునే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ముష్టికుంట్ల సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజరు పి. శ్రీనివాసరావు అన్నారు. ముష్టికుంట్ల సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఆవరణలో డ్వాక్రా మహిళలకు రుణాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చే సదుపాయం డ్వాక్రా గ్రూపులకే ఉందని, ఎటువంటి హామీ లేకుండా ఇచ్చే ఈ రుణాలు స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలన్నారు. తీసుకున్న రుణాలు సక్రమంగా, సకాలంలో తిరిగి చెల్లించి బ్యాంకులతో సంబంధాలు పెంచుకోవాలని సూచించారు. స్వయం సిద్ధ, ముద్ర రుణాలు, వ్యక్తిగత రుణ సదుపాయాల గురించి కూడా మేనేజర్ వివరించారు. ఫీల్డ్ అధికారి శివ పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్‌పై దాడి కేసులో నిందితులకు రిమాండ్

మైలవరం: ఎలక్ట్రీషియన్ షేక్ బాజీపై దాడిచేసిన నిందితులను రిమాండ్‌కు పంపారు. షేక్ బాజీ మంగళవారం రాత్రి ఇంటికి వెళుతున్న సమయంలో పాత గొడవల నేపథ్యంలో కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో షేక్ బాజీ తలకు తీవ్ర గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం నిందితులు షేక్ అఫ్రిది, షేక్ అసిఫ్‌లను మైలవరం మార్కెట్ యార్డు సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచి అనంతరం నూజివీడు సబ్ జైలుకు తరలించారు.

మద్యం షాపు కేటాయింపు

మైలవరం: గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపులకు గొల్లపూడిలో నిర్వహించిన లాటరీలో రెడ్డిగూడెం మండలానికి ఒక షాపు కేటాయించారు. పెనుగంచిప్రోలుకు చెందిన గాలి సాయి మణికంఠకు లాటరీలో మద్యం షాపు లభించిందని మైలవరం ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

బడి ఈడు పిల్లల గుర్తింపునకు సర్వే

తిరువూరురూరల్: విద్యా హక్కు చట్టం ప్రకారం బడి ఈడు పిల్లలు పనులకు వెళ్లరాదని, ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సాయిరాం అన్నారు. గానుగపాడు, చౌటపల్లి గ్రామాల్లో పాఠశాలకు రాని బడి ఈడు పిల్లల గుర్తింపునకు ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే నిర్వహించారు. బడి ఈడు పిల్లల వివరాలను సేకరించిన ఉపాధ్యాయులు బాల కార్మిక చట్టం ప్రకారం పిల్లలతో పనిచేయిస్తే ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. ఉపాధ్యాయులు రాంప్రదీప్, రామారావు సర్వేలో పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

మైలవరం: రెడ్డిగూడెం మండలం రుద్రవరం గ్రామంలోని రెండు రేషన్ షాపులను తహసీల్దార్ జె. సుశీలాదేవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేశామని ఆమె చెప్పారు. ప్రజా పంపిణీ విధానం సక్రమంగా నిర్వహించాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, వీఆర్‌ఓ పి. నాగజ్యోతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మహిళలకు ఉచిత వైద్య శిబిరం

తిరువూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తామని తిరువూరు భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజరు రవి కుమార్ తెలిపారు. బ్యాంకు ఆవరణలో నిర్వహించే ఈ శిబిరంలో డాక్టర్ తాళ్లూరి రామకోటేశ్వరరావు మహిళలకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అనంతరం స్వయం సిద్ధ రుణాల గురించి ఏర్పాటు చేసే అవగాహన సదస్సులో ఆర్డీఓ మాధురి పాల్గొంటారని చెప్పారు.

హెల్మెట్ లేకుంటే కేసులే

విస్సన్నపేట: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ విధిగా ధరించాలని తిరువూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు అన్నారు. విస్సన్నపేటలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. మారిన రోడ్డు భద్రతా చట్టాల ననుసరించి హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారికి జరిమానా విధిస్తామన్నారు. విస్సన్నపేట ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఆగిరిపల్లి: సబ్ జోన్ ఆటల పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను ఈదులగూడెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తాడి ప్రసాద్ అభినందించారు. ఫిబ్రవరిలో ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన సబ్ జోన్ ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

తిరువూరు ఆర్డీఓ మాధురి

తిరువూరు: నెమలి వేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 14న కల్యాణోత్సవం జరుగనున్నందున భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి మాధురి అధికారులను ఆదేశించారు. తిరువూరు ఆర్డీఓ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో గురువారం ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్ల ఏర్పాటు, దర్శనం అనంతరం ప్రసాదాల కౌంటర్లలో తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతి సదుపాయం కల్పించడంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్యారోగ్య సదుపాయాల విషయంలో సంబంధిత అధికారులు దేవాలయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు పక్కాగా చేయాలని చెప్పారు.

ఆలయ సహాయ కమిషనర్ సంధ్య, తిరువూరు, గంపలగూడెం మండలాల రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్యారోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ మాధురి

హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ

జి.కొండూరు: వాహన చోదకులు హెల్మెట్‌ను ధరించినప్పుడే ప్రమాదాల భారి నుంచి ప్రాణాలను కాపాడుకోవచ్చని సీఐ దాడి చంద్రశేఖర్ అన్నారు. పోలీసులు స్థానిక యువకులతో కలిసి హెల్మెట్ ధారణపై అవగాహనా ర్యాలీని మండల పరిధిలో గురువారం నిర్వహించారు. జి.కొండూరులో ప్రారంభమైన ఈ ర్యాలీ కట్టుబడిపాలెం, కవులూరు, వెలగలేరు, కందులపాడు, హెచ్. ముత్యాలంపాడు, ఆత్కూరు గ్రామాల మీదుగా తిరిగి జి.కొండూరుకు చేరుకుంది. సీఐ మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే చట్టపరంగా జరిమానాలు విధిస్తామన్నారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్సు, వాహనానికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.



జి.కొండూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ సతీష్‌కుమార్

కార్మికులు భద్రత పరికరాలు ధరించాలి

ఎన్టీటీపీఎస్ ఎస్‌ఈ అనూరాధ

ఇబ్రహీంపట్నం: పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు విధిగా భద్రతా పరికరాలు వినియోగించాలని ఎన్టీటీపీఎస్ నాలుగో స్టేజ్ ఎస్‌ఈ పి.అనూరాధ అన్నారు. భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం కార్మికులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్లోరిన్, అమ్మోనియా, హైడ్రోజన్ డోజింగ్ చేసే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమాత్రం అజాగ్రత్త వహించినా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. ప్రాణ నష్టం జరుగుతుందని చెప్పారు. సంస్థ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని విధులు నిర్వహించాలని సూచించారు. కర్మాగారాల మేనేజర్ శేషాద్రి శేఖర్, ఈఈ శ్రీనివాస్, విజయకుమార్, సుధాకర్, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు మాజీ సర్పంచ్ స్వస్తి

నూజివీడు: తాను రాజకీయాలకు స్వస్తి చెబుతున్నట్లు స్నేహ రైడ్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్, పాత రావిచర్ల మాజీ సర్పంచి బసవరాజు నగేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 40 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో తాను 30 ఏళ్లు పాత రావిచర్ల సర్పంచ్‌గా గ్రామానికి సేవలు అందించానన్నారు. ఎమ్మార్ అప్పారావు, కోటగిరి హనుమంతరావు, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నాయకత్వంలో ఎటువంటి మచ్చ లేకుండా తాను ఉన్న పార్టీకి చెడ్డ పేరు రాకుండా నేను చేయగలిగిన స్థాయిలో ప్రజలకు సేవలందించానన్నారు. అలాగే స్వచ్ఛంద సంస్థను సైతం ఏర్పాటు చేసి, అనాథ పిల్లలకు, దివ్యాంగులకు అనారోగ్యంతో బాధపడే పిల్లలకు శాయశక్తులా సేవలు అందిస్తున్నానన్నారు. ఇక నుంచి ఏ రాజకీయ పార్టీలో లేకుండా రాజకీయాలకు దూరంగా ఉంటూ స్నేహ రైడ్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నానని వివరించారు.

పీ ఫోర్ సర్వేపై ఉద్యోగులకు శిక్షణ

తిరువూరు: గంపలగూడెం మండలంలో పీ4 సర్వే నిర్వహణపై గురువారం సచివాలయ ఉద్యోగులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్ అనే అంశంపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు సర్వే జరపాలన్నారు. 27 అంశాలతో కూడిన ప్రశ్నావళి ఉంటుందని, ప్రధానంగా ఆయా కుటుంబాలు కలిగిన వాహనాలు, ఆస్తి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. సర్వే అనంతరం గ్రామ సభలు నిర్వహించి ఆమోదించనున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో మహిళలకు ఆటల పోటీలు



నూజివీడు: అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ట్రిపుల్ ఐటీలో గురువారం మహిళా అధ్యాపకులకు, సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ మహిళా సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమైనది కావడంతో వారిని గౌరవించాలనే లక్ష్యంతో ఆటల పోటీలు నిర్వహించామని ఏఓ బి.లక్ష్మణరావు పేర్కొన్నారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్, స్టూడెంట్ మిత్ర సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, టెన్నికాయిట్, టగ్ ఆఫ్ వార్ తదితర ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.